# జడకుచ్చులు

నేను బజారునుంచి వచ్చేసరికి మా పిల్లలిద్దరూ క్రొత్త గుడ్డలు కట్టుకొనివున్నారు. చిన్నమ్మాయి రత్నకుమారి పెళ్ళి కూతురిలా తలవంచుకొని వాళ్ళమ్మముందు కూర్చొని జడవేయించుకొంటూవుంది. పెద్దమ్మాయి ఇందిర గోడనానుకొని ఏడుస్తూ నిల్చొనివుంది.

"ఎందుకమ్మా ఇందిరా ఏడుస్తున్నావ్?" అని ఇందిరనడిగాను. సమాధానం రాలేదు. "అసలింతకీ ఏమిటి ముస్తాబు?" అని వాళ్ళమ్మనడిగాను,

"ఆ ఏముంది. ఈపూట సినిమాకి వెళ్దామని క్రొత్తబట్టలుకట్టి జడలు వేస్తున్నాను" అన్నది వాళ్ళమ్మ.

"అయితే ఇందిర ఏడుస్తుందెందుకు?"

"జడకుచ్చులు కావాలని చిన్నది ఏడుస్తూంది. అందుకని. 'చెల్లెలికి జడకుచ్చులు వేస్తాను, నీకు రిబ్బను వేస్తాను' అన్నాను పెద్దదానితో. కాదు కూడదు జడకుచ్చులు తనకే వెయ్యాలని ఏడుస్తూంది ఇందిర" అని సమాధానం యిచ్చింది వాళ్ళమ్మ విసుక్కుంటూ.

"ఇందిరా! చెల్లాయిని వేసుకోనివ్వరాదూ ఈ ఒక్కరోజుకీ?" అన్నాను గడ్డంపట్టి తల పైకి ఎత్తి కళ్ళల్లోకి చూస్తూ. "ఊహూ! నాకే వెయ్యాలి. అసలవి నావి కావా యేంది?" అన్నది ఇందిర ఏడుస్తూనే.

"నీవేలే! కాని, చిన్నాయి ఏడుస్తుందిగా! అందుకని ఇవ్వాళ నువ్వు రిబ్బను వేయించుకో! బంగారుకొండవు గదూ!" అన్నాను ఇందిరను సముదాయిస్తూ.

"నాకా రిబ్బనేం బాగుండలేదు. నా జడకుచ్చులే నాకు కావాలి!" అన్నది ఇందిర బుంగమూతిపెట్టి. "పోనీ, రేపు మనం క్రొత్తవి తెచ్చుకుందాం...సరేనా?"

"సరే" అన్నట్టుగా తల ఆడించింది ఇందిర.

ఇంతటితో ఈ తగవు తీరిపోయిందిగదా అని సంతృప్తిచెందాను. కాని, మా చిన్నది రత్నకుమారి ఊరుకుంటేగా!

"క్రొత్తజడకుచ్చులే నాకు కావాలి! పాతవి నాకొద్దు!" అని మారాము చేయసాగింది

"అయితే అక్కాయి జడకుచ్చులు అక్కాయికివ్వు! రేపు నీకు క్రొత్తవి తీసుకొస్తాను" అన్నానో లేదో "ఇవిగోనమ్మా తీసుకో! నాకెందుకు?" అంటూ జడకుచ్చులు ఇందిరపైకి విసిరివేసింది రత్నకుమారి.

"పోనీ ఎలాగైతేనేం ఇందిర జడకుచ్చులు ఇందిరకే లభించాయ్! తగాదా తీరిపోయింది" అని మనస్సులో అనుకున్నాను.

కాని, అన్నీ అనుకున్నట్టుగా జరిగితే ఆశ్చర్యపడవలసిందేముంటుంది? అందులో పిల్లల తగాదాలు ఒక పట్టాన పరిష్కారమయ్యేటట్లయితే ఓ ఇల్లులో ప్రథమ తాంబూలం పుచ్చుకునే 'స్త్రీ' కూడా పిల్లల్ని దువ్వేదీ బ్రతికేదీ తెలియకుండా బాధపడవలసిన అవసరం ఏముంటుంది?

"ముందు...... కొత్తవి నాకే తెస్తానన్నావ్. ఇప్పుడేమో చిన్నాయి కంటున్నావు మళ్ళీ. అసలు నాకు యీ పాత జడకుచ్చులు వద్దులే" అంటూ విసురుగా లోపలికి వెళ్ళిపోయింది ఇందిర.

"అబ్బబ్బ! వీళ్ళు పిల్లలు గారు. పిశాచాలు ఇప్పటివరకూ ఆ జడకుచ్చులు నాక్కావాలంటే నాక్కావాలని పోట్లాడుకున్నారు. తీరా యిప్పుడు నాకొద్దంటే నాకొద్దని మారాం చేస్తున్నారు. వీళ్ళతో ఏలా వేగటం?" అని విసుక్కుంటూ, తన ముందు కూర్చొనివున్న రత్నకుమారి తలమీద ఒక మొట్టికాయ వేసింది వాళ్ళమ్మ.

రత్నకుమారి కూనిరాగం తీయసాగింది.

"నోరు మూస్తావా, లేదా?" అంటూ చెయ్యెత్తింది వాళ్ళమ్మ మళ్ళీ కొట్టటానికి.

"ఎందుకు దాన్నలా కొట్టుకుంటావ్? ఎలాగోలా సముదాయించాలిగాని" అన్నాను.

"ఏమోనండి! వీళ్ళని సముదాయించడం నావల్ల గాదు. చేతనైతే మీరే సముదాయించుకోండి!" అన్నది వాళ్ళమ్మ.

అది ఒకవిధంగా నామీద 'ఛాలెంజి' చేసినట్టే అనిపించింది. అందుకని దిగ్గునలేచి లోపలికెళ్ళి ఇందిరను బుజ్జగించి, మంచి బొమ్మల పుస్తకం యిస్తాను రమ్మన్నాను. ఇంకేం! నాగస్వరానికి లోపడిన పాములాగా నా గదిలోకి వచ్చి కూర్చుంది ఇంది.

అలపర్తి
వెంకట సుబ్బారావు

అలమరలో వున్న పిల్లల బొమ్మల శ్రీకృష్ణలీలలు పుస్తకం తీసి ఇందిర కిచ్చాను. వెంటనే ఇందిర ఆ బొమ్మలు చూసుకోవడంలో మునిగిపోయింది. మధ్య మధ్య 'ఈ బొమ్మేమిటి?' 'ఇందులో యీ బొమ్మ ఏం చేస్తుంది?' మొదలైన ప్రశ్నలడగసాగింది.

* * *

ఏవో నాకు తోచిన సమాధానాలు చెప్పసాగాను. అప్పుడప్పుడు ఏం చెప్పాలో అర్థమయ్యేదిగాదు. మెదలకుండా వూరుకోవడమే శరణ్యం! కాని, ఇందిర వూరుకుంటేగా? ఏదో సమాధానం తనే చెబుతూంది. 'ఆఁ అంతే!' అంటున్నాను నేను. దాంతో అది సంబరపడిపోతూవుంది.

వరుసగా బొమ్మలు చూస్తూ, బలరామకృష్ణులు ఏనుగును చంపుతున్న బొమ్మను చూపి, "యీ పిల్లలిద్దరూ ఎవరు నాన్నా?" అని అడిగింది ఇందిర.

"బలరామ కృష్ణులు. ఇద్దరూ అన్నదమ్ములు" అన్నాను.

"మరి యిదేమిటి?" అని అడిగింది ఏనుగును చూపిస్తూ.

"ఏనుగు!" అని నే చెప్పానో లేదో...

"ఏనుగు ఏనుగు నల్లన
ఏనుగు కొమ్ములు తెల్లన
ఏనుగుమీదా రాముడు
ఎంతో చక్కని దేముడు!"

అంటూ వాళ్ళతాత నేర్పిన పాటపాడి, "మరి ఈ ఏనుగుమీద రాముడేడి నాన్నా?" అని అడిగింది ఇందిర.

"ఈ ఏనుగు మంచిది కాదులే. అందుకని దీనిమీద రాముడు లేడు."

"అయితే మరి యీ పిల్లలిద్దరూ ఎందుకెక్కుతున్నారు?"

"వాళ్ళు ఎక్కటంలేదు. దాన్ని చంపబోతున్నారు!"

"ఎందుకు?" అన్నది విచారంగా మొగం పెట్టి ఇందిర. ఎందుకు చంపుతున్నదీ ఇందిరకర్థమయ్యేలా చెప్పాలంటే మొత్తం కథ అంతా చెప్పాలి. అందుకని తేలిగ్గా దానికి నచ్చచెప్పడం ఎలాగా అనుకుంటూ వుండగా...

"అది మంచిది గాదని చంపబోతున్నారా?" అని మళ్ళీ ఇందిరే అడిగింది.

"అవును. అందుకనే!" అన్నాను నేను శ్రమ తప్పినందుకు సంతోషిస్తూ.

ఇంకొంచెంసేపు ఆ బొమ్మవంక చూసి "ఇంకా చంపరేం నాన్నా?" అని అడిగింది, ఇందిర.

ఏం సమాధానం చెప్పాలి? "ఇప్పుడప్పుడే చంపరులే" అన్నాను, ఏదో విధంగా దాటెయ్యాలని.

"రేపు చంపుతారా?" అన్నది మళ్ళీ ఇందిర.

"అవును" అని తలవూపాను.

ఆ తర్వాత కొంతసేపు యింకా పరీక్షగా బొమ్మకేసి చూసి, "ఇదేమిటి నాన్నా?" అని అడిగింది ఇందిర, కృష్ణుని తలమీదవున్న "నెమలికన్ను" చూపిస్తూ.

## జడకుచ్చులు

"నెమలికన్ను!"

"ఎందుకు తలమీద పెట్టుకున్నాడు?"

"అందానికి."

"అయితే మరి, యీ రెండో అబ్బాయి పెట్టుకోలేదేం?" పెద్ద చిక్కు ప్రశ్న వేసింది, దీనికి సమాధానం ఏం చెప్పాలో తోచటం లేదు. ఆలోచిస్తున్నాను.




"ఆగిండ్లో అబ్బాయికి నెమిలి కన్ను లేదా పెట్టుకోటానికి?' అని మళ్ళీ ఇందిర నాకు కొంచెం ఆధారం అందజేసింది.

దాంతో నా మనస్సులో ఒక మెరపు మెరిసింది. దీన్ని ఆధారం చేసుకొని ఒక కథ కల్పించి చెప్పి, ఇందిరలో మార్పు తీసుకు రావాలనుకున్నాను.

"అసలా నెమిలికన్ను మొట్టమొదట పెద్దబ్బాయి తలమీదనే వుండేది. కాని, ఒకనాడు తనకా నెమిలికన్ను కావాలని యీ చిన్నబ్బాయి శ్రీకృష్ణుడు ఏడ్చాడు. ఇంకేం! పెద్దబ్బాయి బలరాముడు, తన తలమీది నెమిలికన్ను తీసి, తమ్మునికిచ్చాడు ఎప్పటికీ, అప్పటినుంచీ ఆ నెమిలికన్ను చిన్నబ్బాయి శ్రీకృష్ణుడే పెట్టుకుంటున్నాడు.

"అంతేగాని నీలాగా నాకే కావాలని మారాం చెయ్యలేదు పెద్దబ్బాయిబలరాముడు చిన్నవాడు శ్రీకృష్ణుడు ఏడ్వకుండా వుంటే చాలనుకున్నాడు.

"అందుకే పెద్దవాడు బలరాముడు బుద్ధిమంతుడని వాళ్ళమ్మ, నాన్న మెచ్చుకున్నారు.

"చిన్నవాడు శ్రీకృష్ణుడు అల్లరివాడని యిప్పటికీ అంతా అంటూ వుంటారు.

"తల్లిదండ్రులు చెప్పినమాట విన్నవాళ్లూ, తమ్ముళ్లనీ, చెల్లెళ్ళనీ ఏడిపించకుండా ఆడించిన వాళ్ళూ మంచివాళ్లనిపించుకుంటారు. మరి, నీకుమాత్రం మంచిదానివనిపించుకోవాలని లేదూ?" అన్నాను.

"ఉంది" అన్నట్టుగా తలవూపింది ఇందిర.

"ఇంకేం! ఈ రోజునుంచీ నీ 'జడకుచ్చులు' చెల్లెల్ని వేసుకోనివ్వు! నువ్వు రిబ్బను వేయించుకో!" అన్నాను.

"సరే!" అని తల వూపింది ఇందిర.

అంతే! అప్పటినుంచి మళ్లీ ఎన్నడూ 'జడకుచ్చులు' కావాలని మారాం చెయ్యలేదు ఇందిర. ★

---

ఒకానొక కేసులో తక్కువ ఫీజు పుచ్చుకున్నందుకు ఒక న్యాయవాదిని మరొక న్యాయవాది అవహేళన చేశాడు.

తక్కువఫీజు తీసుకున్న మాట నిజమేనని అంగీకరిస్తూ ఆన్యాయవాది ఇలా అన్నాడు:

"అయితే ఏం? మా క్లయింటువద్దఉన్న సొమ్మంతా ఫీజుగా గుంజుకున్నానులే."

తటవర్తి ప్రసాదరావు (హైదరాబాదు)

---

# బడి అంటే.........

## నాగభైరవ కోటేశ్వరరావు

ఆలవారి అమ్మాయిఅ రాజ్యలక్ష్మి
తొలినాడు బడినుండితిరిగి వచ్చింది
పలక బలపం అవల పారవైచింది
పలికింది తల్లితో మురిపమ్ము మీర.

"బడియంటే యేమిటోనని
భయపడ్డానే అమ్మా!
ఇంతేనా బడియంటే
వింతగ ఉందే చూస్తే!

"అది యేమిటె మా పంతులు
కంతపాటి గుండువుంది!
నున్నని ఆ గుండు మీద
నన్నని ఆ పిలకేమిటి?

చదువు చెప్ప మాస్టరుగద
చక్కని క్రాపు ఉంటేనేం?
"ముక్కుపొడుగు మాష్టారుకు
తిక్కేమైనా ఉందా?

తిక్కతిక్క ప్రశ్నలడిగి
తిప్పలు పెట్టాడు నన్ను
అంత గొప్ప మాష్టారే
అసలెరుగడు నాన్న పేరు!

"'స్టాండ'న్నా డొక్కసారి
చక్కగ నిలబడ్డామా!
అంతలోన 'సిట్' అంటే
అందరమూ కూర్చున్నాం —

అదియేమిటె పిచ్చివాడు
అన్నమాట నిలుపుకోడు —
"గుండ్రని సున్నాలు చుట్ట
కుండ, వంకరటింకరగా

ఏమేమో వ్రాసిపెట్టి,
ఏమో! దిద్దంగ మన్నెను —
అదియేనా చదువంటే
అయితే నే చదువనమ్మ!

పిన్నిగారి మీనాక్షికి
పెద్దపేర్లు వ్రాసిపెట్టి
'అఆ' లను నాకువ్రాసి
అవియె దిద్దమని నాడే

ఎందులకే మాస్టారుకు
ఇంత పక్ష పాతమమ్మ —
'కాకీ - నక్కా' పాటలు
కమ్మగ పాడాడు గాని

చక్కగ సినిమాలో పా
టొక్కటైన పాడలేదు.
ఆగుమూడు కూడనెంత
అవుతుందో చెప్పడంచు

పిల్లల నడిగాడమ్మా
పిచ్చివాడు మా మాస్టరు
ఆమాత్రము తెలియని వా
డేమి మాస్టరే చెప్పుము!

"రైలుఆట' అనే ఆట
రైటుగ నేర్పాడుగాని
బొమ్మల పెండ్లి ఆట
బొత్తుగ మాస్టరుకు రాదు.

చక్కని పూదోట బడికి
ప్రక్క, పూలు పూచివుంది —
మొక్కల కెవ్వరు నీళ్లను
మోసుకొచ్చి పోస్తారే!

బోడివాడు గద మాస్టరు
పూలెవరికో చెప్పవటే!
అమ్మోవ్! శారద కున్నది
బొమ్మల పరికిణి ఒక్కటి

నాక్కూడా అల్లాంటిది
నాన్నెప్పుడు తెస్తాడే!